# మినీ కథలు

## మర్యాద

పాలుగు వెంకటేశ్వరరావు



"ఏయ్ మిస్టర్! నీ జేబులో ఎంత వుంది?"

"రెండు వందల ముప్ఫయిరూపాయలు. ఎందుకూ?"

"ఎందుకా? తెలీట్లంలేదూ? సమయం రాత్రి వంటిగంట యింది. నువ్వు అరిచి గీపెట్టినా, నీకు సహాయానికి ఎవరూ రారు. నేనా, పేరు మోసిన గజదొంగని– పచ్చినెత్తురు తాగేవాడిని."

"అయితే ?!"

"నా చేతిలో కత్తివుంది. కసుక్కున ఒక్కపోటు పొడిచానంటే, గిలగిలా తన్నుకుని చచ్చినా దిక్కూ మొక్కూ"

"అలాగా:!"

"ఔను. ఇప్పుడే–ఒక కమీషన్ వ్యాపారీ, ఒక స్టూడెంటు కుర్రాడూ, ఒక షాపు యజమానీ, ఒకరు తరువాత ఒకరుగా తమ జేబుల్లో వున్న డబ్బులిన్నీ, వాచీలిన్నీ, వుంగరాలిన్నీ నాకు సమర్పించి బ్రతుకు జీవుడా అంటూ పారిపోయారు. నేను ఎన్నో హత్యలు చేసి పేరుమోసిన పెద్ద రవుడీని. కాస్త మంచివాడిని గనుక, ప్రాణాల్తో వదిలిపెడ్తున్నాను. వింటున్నావా?"

"ప్చ్. పాపం! అలాగా! వింటున్నానులే."

"ఇక ఆలస్యం చెయ్యకు. అన్యాయంగా ప్రాణాలు పోగొట్టుకుంటావు. దగ్గర్లో ఒక్క పోలీసు స్టేషనయినా లేదు. తియ్యి!"

"మన మధ్యకి పోలీసువాళ్ళు ఎందుకులేగాని. మర్యాదగా ఆ కత్తిని అవతల పారేసి, బుద్ధిగా నీ దగ్గరున్న ఆ దొంగ సొమ్ముల్ని ఇట్లా ఇవ్వు. వినపడ్తూందా? నేను కనపడ్తున్నానా?"

"ఇదేమిటండీ! మీరూ నాలాగే మర్యాదస్తుల్లా వున్నారు గద! మనలో మనకెందుకు చెప్పండి ఈ గొడవలు? స్నేహంగా ఎవరిదారిన్న వాళ్ళు పోతే పోలా? ఏమంటారూ?"

"అదేంకుదర్దు. కదిలావంటే చచ్చి వూరుకుంటావు!"

"అయ్యో. ఏమిటండీ ఈ దౌర్జన్యం? మంచీ మర్యాదా లేదా? సరే. మీకు న్యాయంగానే అనిపిస్తే అలాగే తీసుకోండి."

"ఇది మొదటిసారి గనుక క్షమించి వదిలిపెడ్తున్నాను. ఇంకొకసారి గనుకా, ఆ బారేజీకి ఇటువయిపున కనబడ్డావో, మర్యాద దక్కదు. పరుగెత్తి పారిపోయి ప్రాణాలు దక్కించుకోటో!"

"అలాగే సార్. క్షమించండి. వస్తా."

●

## దొంగకోళ్ళు

అత్తోట విజయలక్ష్మి



"హెడ్డూ, నీ హెడేక్ ఎట్లావుంది?"

"నీ కేసులెట్లా వున్నాయి గురూ. వేలు చూపిస్తున్నావా? వేళ్ళు చూపిస్తున్నావా గవర్నమెంటుకి" రెండు వేళ్ళు చూపుతూ అడిగాడు హెడ్ కానిస్టేబుల్ వీరాస్వామి.

"దిక్కుమాలిన వుద్యోగం — దరిద్రపు వుద్యోగం. నాకు తలనొప్పి అనుకో గురూ యీ వుద్యోగం — ఏం చెయ్యను? గతిలేదు" అంటుంటాడు వీరాస్వామి రైల్వే యిన్స్పెక్టరు. రావుతో హెడ్డు కన్పించినపుడల్లా 'హెడేక్' అంటుంటాడు రావు.

వీరాస్వామి, రావు కులాలు వేరైనా, మతాలు వేరైనా భావాలొక్కటి, ఆశయాలొక్కటే. నూటికి తొంభై పాళ్ళు ధర్మంగా పోవాలని తాపత్రయపడుతుంటారు.

ఒకే స్కూల్లో చదువుకున్నారు. ఒకే వీధిలోనే కాపురాలు కూడా. ఆ వేళ యిద్దరికీ విజయవాడ రైల్వే స్టేషనులో డ్యూటీ పడింది. ఇద్దరికీ కేసులు దొరకలా.

"గురూ! కేసులు, కేసులని ప్రాణం తీస్తారయ్యా పైవాళ్ళు! రోజూ ఎక్కడ దొరుకుతారయ్యా. నా ప్రాణం నేనే తీసుకుని కేసెట్టుకోవాలి! నా జీతం డబ్బులతో నిజాయితీగా బతుకుదామంటే-మా బామ్మర్ది, మేనల్లుడు వచ్చి పడ్డారు. నెలరోజులయింది. రోగానికి మందు పుచ్చుకుంటున్నారు. రోజూ మాంసం మస్తుగా కావాలంటారు. ఎక్కడ్నించి తేను చెప్పు! నాకన్నీ వూరికినే వస్తాయని గోల! మా డిపార్ట్మెంట్లో ఎంత రిస్కో యెదవలకి తెలియదు!" అంటూ పాతబడిన నిత్యకష్టాలిన్ని పాత ధోరణిలోనే వెళ్ళబోసుకున్నాడు వీరాస్వామి.

"మా సుపీరియర్స్ మమ్మల్ని రోజుకు రెండు వేలు చూపించండి అంటారు : నువ్వన్నట్లు 'వేళ్ళు' చూపించాలి" తన బాధ మరోసారి వెళ్ళగక్కాడు రావు.

ఇంతలో వైజాగ్ నుంచి బండి రావటంతో యిద్దరూ డ్యూటీకి తయారయ్యారు. ఒక బోగీలో పదిమంది అప్పలమ్మలు, పదిమంది సింహాచలాలు. బియ్యం బస్తాలు, గంపల కోళ్ళతో గలగల మంటూ దిగడం, పారిపోయి అవతలి బండి యెక్కడం జరిగాయి. చివరికి ఓ పండు ముసలాడు, పదేళ్ళ కుర్రది పెద్ద గంపతో మిగిలారు. "ఏయ్ టిక్కెట్టేది? ఆ లగేజి ఏమిటి?" రావు.

"బాబ్బాబిప్పదాడ్ని. నాకిదికొత్త. కూలిపని చేసుకుందామనొచ్చా ఒగ్గేయండి" దీనంగా అన్నాడు. కుర్రది బెదిరిపోయి ఏడుపందుకుంది.

"గురూ. ఇదేడుస్తోంది. నేనేదో చేశానని నా మీద కేసెడ్తారు. పారిపోతున్నా. దాన్ని సముదాయించు" అవతలికిపోయాడు వీరాస్వామి.

రావుకు ఆలోచన తట్టింది. "ముసలాడా. దాన్లో ఏమున్నాయి?"

"కోళ్ళు." వణుకు. భయం.

"ఆ తట్ట అక్కడ పెట్టి పొండి. ఇంకెప్పుడూ టిక్కెట్టు లేకుండా రావద్దు."

మాట పొంతం కాకుండానే తట్ట వదిలేసి ముసలాడు, కుర్రదీ పరుగందుకున్నారు.

"వీరాస్వామీ! రా. ఆ కోళ్ళు చూడు—మా అటెండరు చూస్తున్నాడు. అతనికి ఒకటిచ్చి, తక్కినవి తీసుకో. మీ బామ్మర్దిని మేపు."

తట్టలో గోనెసంచిలో చెయ్యి పెట్టగానే వీరాస్వామికి నాలుగు మంచంకోళ్ళు దొరికాయి!

"గురూ! మనకే హాండిచ్చాడు"–రావుకు చూపిస్తూ గోల పెట్టాడు.

●